


తళుకు తార..!

అనంతపురం నగరంలో సినీ తారలు అనసూయ, నిధి అగర్వాల్ శుక్రవారం సందడి చేశారు. ఓ షో రూం ప్రారంభోత్సవానికి వచ్చిన వారిద్దరినీ చూసేందుకు జనం ఎగబడ్డారు. వారితో సెల్ఫీలు దిగేందుకు యువకులు ఆసక్తి కనబరిచారు. తమను చూసేందుకు అభిమానంతో తరలివచ్చినవారికి తారలిద్దరూ అభివాదం చేస్తూ.. అలరించారు.

(వివరాలు 7లో..)



నువ్వు తిను అన్నా..!

- పంచాయతీ సొమ్ము దోచిపెట్టిన కార్యదర్శులు
- కక్కలపల్లి కాలనీలో అప్పటి ప్రజాప్రతినిధికి..



పిల్లిగుండ్ల కాలనీలోని వాటర్ ప్లాంట్

అనంతపురం రూరల్, జూలై 12: కక్కలపల్లి కాలనీ పంచాయతీలో పనిచేసిన పలువురు కార్యదర్శులు అప్పటి ప్రజాప్రతినిధి కుటుంబానికి దోచిపెట్టడమే ధ్యేయంగా వ్యవహరించారు. ఇటీవల ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఓ కార్యదర్శి ఆ కుటుంబంతో మరింత అంటకాగారు. అభివృద్ధి పనుల ముసుగులో పంచాయతీ ఆదాయాన్ని ఆ కుటుంబానికి కట్టబెట్టారు. పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఓ వాటర్ ప్లాంట్‌కు కొత్త సిస్టమ్ కొనుగోలు చేసినట్లు బిల్లు పెట్టి.. లక్షలాది రూపాయలను అప్పటి ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుల ఖాతాకు జమ చేసిన వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ వాటర్ సిస్టమ్‌ను ఓ ప్రైవేట్ కంపెనీ పంచాయతీకి ఉచితంగా ఇచ్చినట్లు సమాచారం.

ఎవరో ఇచ్చినదానికి..

- పిల్లిగుండ్ల కాలనీలో పంచాయతీ పరిధిలోని వ్యక్తుల ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌ను నిర్వహించేవారు. తద్వారా వచ్చే ఆదాయాన్ని వాటర్ ప్లాంట్ పక్కనే ఉన్న ఆలయ అవసరాలకు, పూజారి గౌరవవేతనానికి వినియోగించేవారు. వాటర్ ప్లాంట్ ఉన్నది పంచాయతీ స్థలం కావడంతో పంచాయతీ వారు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి ఆలయ పూజారికి పంచాయతీ నుంచే గౌరవ వేతనం ఇస్తున్నారని సమాచారం. రెండేళ్ల కిందట ఓ ప్రైవేట్ కంపెనీ ప్రతినిధి వాటర్ సిస్టమ్ కొనుగోలు చేసి.. పంచాయతీకి ఉచితంగా ఇచ్చారు. కానీ ఆ సిస్టమ్‌ను కొనుగోలు చేసినట్లు చూపించారు. పంచాయతీలో బిల్లు పెట్టి.. రూ.2.4 లక్షలను అప్పటి ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యురాలి ఖాతాలోకి జమచేశారు. ఈ తతంగం నడిపించిన కార్యదర్శి.. సచివాలయం పరిధిలోని ఓ మహిళా ఉద్యోగి ఖాతాలోకి రూ.లక్షకు పైగా సొమ్ము జమచేసినట్లు తెలిసింది. కానీ దానికి సంబంధించి పంచాయతీ రికార్డులో లెక్కలు లేవని సమాచారం.
- గతంలో పనిచేసిన మరో కార్యదర్శి కూడా ఇదే తరహాలో పంచాయతీ సొమ్మును బిల్లుల రూపంలో అప్పటి ప్రజాప్రతినిధికి దోచిపెట్టారని ప్రచారం జరుగుతోంది. మరో అధికారి అప్రూవల్స్ ముసుగులో కోట్ల రూపాయలు వసూలు చేసి అప్పటి ప్రజాప్రతినిధి కుటుంబానికి ఇచ్చినట్లు సమాచారం. పంచాయతీ ఆదాయాన్ని అప్పటి ప్రజాప్రతినిధి కుటుంబానికి దోచిపెట్టిన కార్యదర్శి.. వారం క్రితం సెలవులో వెళ్లారు.

నేడు జగన్నాథ రథయాత్ర



ఇస్కాన్ మందిరంలో జగన్నాథ రథాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది



ఇస్కాన్ మందిరంలో దర్శనమిస్తున్న బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి

అనంతపురం కల్చరల్, జూలై 12: నగరంలో శనివారం నిర్వహించే పూరీ జగన్నాథ రథయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇస్కాన్ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో గవర్నింగ్ బాడీ కమిటీ చైర్మెన్ రేవతీ రమణదాస్ ప్రభు ఈ రథయాత్రను ప్రారంభిస్తారు. రథయాత్రను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నగర శివారులోని ఇస్కాన్ మందిరం వద్ద సందడి నెలకొంది. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జగన్నాథుడి రథయాత్ర ప్రారంభమవుతుంది. కేఎస్ఆర్ కళాశాల నుంచి రథయాత్ర ప్రారంభమై.. సుభాష్ రోడ్డు, క్లాక్‌టవర్, రాజురోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్ రోడ్డు, పాతూరు, గాంధీబజార్, బసవన్న కట్టమీదుగా లలితకళాపరిషత్ వరకూ సాగుతుందని ఇస్కాన్ మందిర చైర్మెన్ దామోదర్ గౌరంగదాస్ వెల్లడించారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ రథయాత్రలో ప్రజలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాతాశిశు మరణాలను అరికట్టండి

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం టౌన్, జూలై 12: జిల్లాలో మాతాశిశు మరణాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, వైద్య సిబ్బందికి డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయంలో మాతాశిశుమరణాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గత నెలలో జరిగిన మాతాశిశు మరణాలు, అందుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది ఆ వివరాలను తెలియజేశారు. మాతాశిశు మరణాలు జరిగినపుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి, మరణానికి కారణాలు ఏమిటో తెలుసుకోవాలని, భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా చూసుకోవాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ప్రసవించిన తరువాత కూడా మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని అన్నారు. గర్భిణిగా గుర్తించిన తర్వాత రికార్డులలో నమోదు చేయాలని, ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన చికిత్సలు అందేలా చూడాలని అన్నారు. రక్త హీనత, గుండె సంబంధిత సమస్యలు, ఉమ్మనీరు తక్కువగా ఉండటం, బిడ్డ పెరుగుదల లేకపోవడం వంటి సమస్యలు ఉంటే.. హైరిస్క్ గర్భిణిగా గుర్తించాలని, ప్రసవం అయ్యేవరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. శిశు మరణాల విషయంలోనూ ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. నెలలు నిండకనే పుట్టిన పిల్లలకు ఏదో ఒక సమస్య ఉంటుందని, అలాంటి శిశువులను ఎన్ఆర్‌సీలలో చేర్పించి, అవసరమైన పరీక్షలు చేయించి, చికిత్స అందేలా చూడాలని అన్నారు. 'ఏ శిశువూ జన్మిస్తూ మరణించకూడదు.. ఏ తల్లీ జన్మనిస్తూ చనిపోకూడదు' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని డీఎంహెచ్ఓ కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ సెల్వమణి రాజ్, డీఐఓ డాక్టర్ యుగంధర్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జీజీహెచ్ డాక్టర్లు నవీన్‌కుమార్, ఇందిరాప్రియదర్శిని, శంకరనారాయణ, ఎంపీహెచ్ఓ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పని ఇక్కడ.. వేతనం అక్కడ..!



రైతు భరోసా కేంద్రం (ఫైల్)

ఆర్బీకే సిబ్బంది విధులలో గందరగోళం

- వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలో విధులు
- పీఆర్ పరిధిలో సెలవులు, వేతనాల మంజూరు
- సిబ్బందికి పనిభారం..
- అధికారులకు నియంత్రణ సమస్య
- వైసీపీ ప్రభుత్వ తప్పిదాన్ని సరిదిద్దాలని సిబ్బంది వినతి



అనంతపురం అర్బన్, జూలై 12: రైతు భరోసా కేంద్రం సిబ్బంది నియామకం, విధుల కేటాయింపు, నియంత్రణ వంటి అంశాలలో వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్త నిర్ణయాలు తీసుకుంది. దీంతో విధి నిర్వహణలో గందరగోళం చోటు చేసుకుంటోంది. సచివాలయ సిబ్బందితోపాటు ఆర్బీకే సిబ్బందిని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా నియమించారు. కానీ ఆర్బీకే సిబ్బంది విధులు నిర్వర్తించేది ఒక శాఖలో కాగా, వారిని నియంత్రించే శాఖ మరొకటి కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఆర్బీకే సిబ్బంది వేతనం, సెలవులు మంజూరు బాధ్యతలను పంచాయతీ సెక్రటరీకి అప్పగించారు. పనులు మాత్రం వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్ శాఖల పరిధిలో చేయిస్తున్నారు. పనులు నిర్వర్తించే శాఖల అధికారులకు ఆర్బీకే సిబ్బందిపై నియంత్రణ ఉండటం లేదు. దీంతో విధుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వేతనాలు, సెలవులు మంజూరు చేస్తున్న కారణంగా ఎంపీడీఓ, పంచాయతీ సెక్రటరీ ఇతర పనులు అప్పగించినా ఆర్బీకే సిబ్బంది చేయాల్సి వస్తోంది. మరోవైపు వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల అధికారులు పనుల నిమిత్తం ఫోన్ చేస్తే.. తాము సెలవులో ఉన్నామని ఆర్బీకే సిబ్బంది చెబుతున్నారు. పంచాయతీ సెక్రటరీల ద్వారా ఆర్బీకే సిబ్బంది సెలవు అనుమతి పొందుతున్న విషయం తెలియక.. పనులు అప్పగించాల్సిన మూడు శాఖల అధికారులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. అత్యవసరంగా ఏవైనా పనులు చేయించాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని వ్యవసాయ శాఖ అధికారులు వాపోతున్నారు. తమకు సంబంధం లేకపోయినా.. ఎంపీడీఓ, సెక్రటరీలు చెప్పే పనులు చేయాల్సి వస్తోందని ఆర్బీకే సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేకుంటే తమకు జీతాలు, సెలవుల విషయంలో సమస్యలు ఎదురవుతాయని వాపోతున్నారు. ఒకే సమయంలో రెండు రకాల పనులు చేయాల్సి వస్తే ఏం చేయాలో తోచడం లేదని, పనిభారంతో సతమతమౌతున్నామని అంటున్నారు.

వైసీపీ హయాంలో జిల్లాలో 451 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 244 మంది ఆర్బీకే సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో వ్యవసాయ శాఖ తరపున 128 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఉద్యాన శాఖ తరపున 108 మంది విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, పట్టుపరిశ్రమ శాఖ తరపున ఎనిమిది మంది విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్లు ఉన్నారు. మిగిలిన స్థానాల్లో ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. ఒక్కో ఆర్బీకేలో ఒక్కో ఉద్యోగిని నియమించారు. వీరు విధులు నిర్వర్తించేది ఒక శాఖలో.. జీతాలు తీసుకునేది మరో శాఖలో కావడం సమస్యలకు తావిస్తోంది. ఆర్బీకే సిబ్బంది వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్ శాఖలకు సంబంధించిన పనులు చేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లల్లో ఈ-క్రాపింగ్, విత్తన పంపిణీ, ఎరువులు, క్రిమిసంహారక మందుల పంపిణీ, రైతు భరోసా, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ జాబితా వెరిఫికేషన్‌తోపాటు క్షేత్ర స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ పలు రకాల సేవలు అందిస్తున్నారు. ఇలా మూడు శాఖల పరిధిలో పనులు చేస్తున్న ఆర్బీకే సిబ్బందికి వేతనాలు, సెలవులు మంజూరు చేసే బాధ్యతలను పంచాయతీ సెక్రటరీకి అప్పగించారు. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా అందరూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఏ శాఖ పనులు చేసే ఆర్బీకే సిబ్బందిని ఆ శాఖలకు కేటాయించాలని కోరుతున్నారు. డీడీఓ (డ్రాయింగ్ డ్రాఫ్ట్ ఆఫీసర్) బాధ్యతలను కూడా వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్ శాఖల అధికారులకు అప్పగించాలని, వేతనాలు, సెలవులు మంజూరు అధికారాన్ని కూడా ఆయా శాఖల అధికారులకే అప్పగించేలా మార్పులు చేయాలని కోరుతున్నారు.

వేతనం ఇక్కడ.. పనులు అక్కడ..

ఇబ్బందులు ఎదురవుతున్నాయి..



ఆర్బీకే సిబ్బందికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా వేతనాలు అందజేస్తున్నారు. పనులేమో వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్ శాఖల్లో చేయిస్తున్నారు. ఎస్ఆర్‌లు మాత్రమే వ్యవసాయ శాఖ ఏడీఏ, ఉద్యాన అధికారి వద్ద ఉంచారు. సిబ్బందికి వేతనాల బిల్లులు పెట్టడం, సెలవులు మంజూరు చేయడం వంటి అధికారాలను పంచాయతీ సెక్రటరీలకు అప్పగించారు. దీంతో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులకు ఆర్బీకే సిబ్బందిపై పూర్తి స్థాయి నియంత్రణ ఉండటం లేదు. వేతనాలు మంజూరు చేస్తున్న శాఖ అధికారుల మాటలలే సిబ్బంది వినాల్సి వస్తోంది. గతంలో అనేక సార్లు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించలేదు. ఇప్పటికైనా ఆర్బీకే సిబ్బందిని పనిచేసే శాఖలకు కేటాయించాలి. అప్పుడే పాలన గాడిలో పడుతుంది.

-లక్ష్మీనారాయణ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

పనిచేసే శాఖలకు కేటాయించాలి..



వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్ శాఖలకు ఆర్బీకే సిబ్బంది బాధ్యతలను పూర్తిగా కేటాయించాలి. వేతనాలు, సెలవులు, విధుల కేటాయింపు తదితర అధికారాలను ఆయా శాఖల అధికారులకే అప్పగించాలి. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటి దాకా పనులు ఒక శాఖలో చేస్తూ.. వేతనం, సెలవులు మరో శాఖ ద్వారా తీసుకుంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొత్త ప్రభుత్వం ఆర్బీకే వ్యవస్థ నిర్వహణలో మార్పులు చేయాలి. పాలనను గాడిలో పెట్టాలి.

-నరసింహ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

పేరు మారదా..!

వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు జిల్లాలో అమలు కావడం లేదు.



యాడికిలో మారని ఆర్బీకే పేరు.. ఇప్పటికీ అలాగే మాజీ సీఎం జగన్ ఫొటో..

గత నెల 29న ఏపీ వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ నుంచి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 451 ఆర్బీకేల పేర్లను రైతు సేవా కేంద్రాలుగా తక్షణమే మార్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కానీ ఎక్కడా పేరు మారలేదు. ఇప్పటికీ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం పేరు, మాజీ సీఎం జగన్ ఫొటో అలాగే ఉన్నాయి. ఆర్బీకేల్లోని కియోస్క్‌లు, యాప్‌లలోని నవరత్నాల లోగో నుంచి జగన్ ఫొటోలను తొలగించారు. కానీ సీఎం చంద్రబాబు ఫొటోలను అప్‌లోడ్ చేయలేదు. జిల్లా వ్యవసాయ సలహా బోర్డు, మండల స్థాయి వ్యవసాయ సలహా బోర్డుల కమిటీలను రద్దు చేసినట్లు చైర్మన్లు, సభ్యులకు సమాచారం అందించారు. కానీ రైతు భరోసా కేంద్రం పేరు మార్చేందుకు నిధుల కొరత ఉన్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో ఆర్బీకేలకు వైసీపీ రంగులు వేయించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కోడ్ కారణంగా ఆ రంగులు మార్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు నానా తంటాలు పడ్డారు. నిధులు లేకపోవడంతో వ్యవసాయ అధికారులు, సిబ్బంది సొంత డబ్బులు వెచ్చించి రంగులు మార్చారు. ప్రభుత్వం నుంచి ఆ డబ్బులు రావాల్సి ఉంది. ఆర్బీకేల పేర్లు మార్చాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశామని జేడీఏ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఒక్కొక్కటిగా సాఫ్ట్‌వేర్‌ను మార్చి, సీఎం చంద్రబాబు ఫొటోలను అప్‌లోడ్ చేస్తామని తెలిపారు.



పుట్లూరు మండలం చెర్లోపల్లిలో పేరు మారని రైతు భరోసా కేంద్రం

ఏమైనా చేయొచ్చు..!

తప్పు చేసినా శిక్షలుండవ్ విద్యాశాఖ, ఎస్ఎస్ఏలో అంతే..!



దర్జాగా టీస్టాల్‌కు ఫైళ్లు తెప్పించి చూస్తున్న ఉద్యోగులు

అనంతపురం విద్య, జూలై 12: సమగ్ర శిక్ష, జిల్లా విద్యాశాఖ పరిధిలో ఎన్ని తప్పులు జరిగినా, ఏం చేసినా అధికారులు చర్యలు తీసుకోరు. కార్యాలయం నుంచి ముఖ్యమైన ఫైళ్లను బయటకు తీసుకెళ్లినా పట్టించుకోరు. ఎవరికి ఏ ఫైల్ కావాలంటే అది ఇట్లే బయటకు వచ్చేస్తుంది. ఏ టీస్టాల్ వద్దనో నింపాదిగా చూసుకుని, తరువాత తిప్పి పంపవచ్చు. సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం నుంచి ఇటీవల ఇద్దరు ఉద్యోగులు ఓ ఫైల్‌ను ఇలాగే బయటకు తెచ్చారు. సమీపంలోని ఓ టీస్టాల్ వద్దకు వాటిని తీసుకుపోయారు. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన సూపరింటెండెంట్ సునీల్ పురమాయించడంతో ఆ పని చేశారు. ఆయనతోపాటు జూనియర్ అసిస్టెంట్ బాలకుళ్లాయప్ప, ఓ అటెండర్ టీస్టాల్ వద్ద కూర్చుని ఆ ఫైల్‌ను పరిశీలించారు. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి, వివరాలు కోరారు. ఇప్పటికే సంబంధిత సిబ్బందిపై చర్యలకు ఫైల్ రాశారు. ఆ ఫైల్‌ను ఏపీసీ వైఖోమ్ నిదియా దేవికి పంపారు. అక్కడి నుంచి ప్రాజెక్టుకు డీపీసీగా వ్యవహరించే డీఈఓ వరలక్ష్మికి కూడా పంపించారని సమాచారం. అలా.. అక్కడి నుంచి ఇక్కడికి.. ఇక్కడి నుంచి అక్కడికి ఫైల్ తిరుగుతోంది. కానీ బాధ్యులపై ఇప్పటి వరకూ చర్యలు తీసుకోలేదని, చర్యలు తీసుకునే ఆలోచన కూడా అధికారుల్లో కనిపించడం లేదని విద్యాశాఖ, సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉద్యోగులే అంటున్నారు. ఫైళ్లను బటకు తెప్పించిన సునీల్ సూపరింటెండెంట్ కావడంతో.. ఆయనపై చర్యలు తీసుకోవాలని కడప ఆర్జేడీకి నివేదించారు. అక్కడ కూడా ఇప్పటి వరకూ చలనం లేదు.

నెట్టికంటి ఆలయ గడపకు వెండి నగిషీ



ఎమ్మెల్యే జయరాం చేయించిన వెండి తొడుగు

గుంతకల్లు, జూలై 12: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ గడపకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వెండి నగిషీని చేయించి సమర్పించారు. ఆలయ గర్భగుడి గడపకు మునుపు ఉన్న వెండి తొడుగు దెబ్బతినడంతో ఎమ్మెల్యే రూ.2.60 లక్షలు వెచ్చించి కొత్త తొడుగును చేయించారు. ఎమ్మెల్యే కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్, సోదరుడు శ్రీనివాసులు ఆలయ అధికారులకు నగిషీని శుక్రవారం అందజేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు పూజలు నిర్వహించి, గడపకు కొత్త నగిషీని తొడిగారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులచేత స్వామివారి సన్నిధిలో పూజలు చేయించారు. స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారికి నెట్టికంటి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భద్రాజీ, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున, ప్రధానార్చకులు గరుడాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలు ప్రమాదకరం

ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

అనంతపురం క్రైం, జూలై 12: కొత్త క్రిమినల్ చట్టాలు ప్రజల జీవితాలకు ప్రమాదకరమైనవని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన క్రిమినల్ చట్టాల మీద జిల్లా కోర్టు ఆవరణలోని అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బెయిల్ మంజూరులో మార్గదర్శకాలు, పోలీసు అధికారులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లుగా పరిగణించడం, జ్యుడీషియరీ అధికారాలు నియంత్రించేలా ఉండటం వంటి అంశాలు కొత్త చట్టాలలో ఉన్నాయని అన్నారు. ఇటీవల భద్రాచలంలో కృష్ణప్రసాద్ అనే న్యాయవాదిని అరెస్టు చేసి, గొలుసులతో కట్టి కోర్టుకు తీసుకెళ్లిన ఘటన, అక్కడ పోలీసు అధికారి చట్టం ద్వారా పోలీసులకూ అధికారం ఉందని మాట్లాడిన తీరు న్యాయవాద సమాజాన్ని ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు. కొత్త చట్టాల అమలు ద్వారా న్యాయవాదులకు సవాళ్లు ఎదురుకానున్నాయని అన్నారు. చట్టాలు రూపొందించే ప్రక్రియ సరిగా జరగలేదని అన్నారు. ఐలు బార్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఐలు ప్రతినిధులు సతీష్, వీరా తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులపై కక్ష సాధింపులు మానుకోవాలి

మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్



మాట్లాడుతున్న విజయకుమార్

గుంతకల్లు, జూలై 12: రైల్వే ఉద్యోగులపై యాజమాన్యం కక్షసాధింపు చర్యలను మానాలని మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద మజ్దూర్ యూనియన్ రైల్వే ఉద్యోగుల సమస్యలపై ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగులు, కార్మికులు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలంటూ నినాదాలు చేశారు. డివిజనల్ కార్యదర్శి మాట్లాడుతూ రైల్వే కార్మికులకు, ఉద్యోగులకు ఏమాత్రం ఆమోద యోగ్యం కాని నూతన పింఛను విధానాన్ని బలవంతంగా రుద్దారన్నారు. 8వ పే రివిజన్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని, పాయింట్స్‌మెన్‌కు 4 గ్రేడ్స్ ఇవ్వాలని, పాయింట్స్‌మెన్‌తోపాటు ట్రాక్‌మెన్‌కు రూ. 4,200ల గ్రేడ్‌పే ఇవ్వాలని, ట్రైన్ పాసింగ్ డ్యూటీలు చేసేవారికి రిస్క్ అలవెన్సు, హార్డ్ డ్యూటీ అలవెన్సులను ఇవ్వాలని, ట్రాక్‌మెన్‌కు సైకిల్ అలవెన్సును ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఏదైనా ప్రశ్నకు సమాధానమిస్తే ఎదురు మాట్లాడుతున్నారంటూ రైల్వే ఉద్యోగులపై ఉన్నతాధికారులు కక్షగడుతున్నారని వెంటనే వేధింపులను మానాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఏడీఎస్‌లు మధుసూదన రావు, నారాయణ, శేఖర్‌బాబు, అశ్విని, కార్యదర్శులు ఎస్ఎం బాషా, రమేశ్, సుధాకర్, రాజశేఖర్, మనోహర్, రవీంద్రనాయక్, సురేష్ పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం

జలవనరుల శాఖ ఇంజనీర్లకు సీఈ, ఎస్ఈ సూచన



సీఈని అభినందిస్తున్న హంద్రీనీవా ఎస్ఈ, ఇంజనీర్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 12: ఇంజనీర్లు, ఉద్యోగులందరూ కలసికట్టుగా పనిచేసి జిల్లాను సస్యశ్యామలం చేద్దామని జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హంద్రీనీవా ఎస్ఈ దేసేనాయక్ పిలుపునిచ్చారు. జలవనరుల శాఖ సీఈగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజను శుక్రవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని ఆ శాఖ కార్యాలయంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్ ఆధ్వర్యంలో ఇంజనీర్లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ పనులను సకాలంలో పూర్తిచేసి జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇందుకు సమష్టి కృషి, ప్రణాళికతో ముందుకు వెళ్దామని అన్నారు. జిల్లాకు వీలైనంత ఎక్కువ నీటిని శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా కాలవ ద్వారా తీసుకువచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. హంద్రీనీవా డిప్యూటీ ఎస్ఈ రాంభూపాల్‌రెడ్డి, ఏపీ ఇరిగేషన్ ఎన్జీఓ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీటెక్ కన్వీనర్ కోటాలో 40,891 సీట్లు

జేఎన్‌టీయూ 40,399, ఎస్కేయూ 330, బెస్ట్‌కు 113తోపాటు సీఏఎంఎస్‌కు 29 కేటాయింపు..

ముగిసిన ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

నేడు మార్పునకు అవకాశం

అనంతపురం సెంట్రల్, జూలై 12: ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు బీటెక్ ఇంజనీరింగ్ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద ప్రవేశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 40891 సీట్లను కేటాయించింది. వీటిలో జిల్లాలోని జేఎన్‌టీయూ 40399, ఎస్కేయూ 330, బెస్ట్ ప్రైవేట్ యూనివర్సిటీ 113, కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్(మడకశిర) 29 చొప్పున మొత్తం 40891 సీట్లున్నాయి. జేఎన్‌టీయూ పరిధిలో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాలవ్యాప్తంగా నాలుగు కానిస్టిట్యూయేట్, 67 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలున్నాయి. అదే విధంగా ఎస్కేయూ క్యాంపస్, బెస్ట్ యూనివర్సిటీ, ఆచార్య ఎన్‌జీ రంగ అగ్రికల్చర్ అనుబంధంగా కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కాలేజ్ మొత్తం 74 కళాశాలలున్నాయి. కన్వీనర్ కోటాలో సీటు పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. ఉద్యోగులు, రేషన్ కార్డులేని వారు సొంతంగా కట్టుకోవాల్సి ఉంటుంది. ఒక్కో సీటుకు జేఎన్‌టీయూ అనుబంధ ప్రైవేటు కళాశాలల్లో కనిష్ఠం రూ.40వేల నుంచి రూ.84వేల వరకు ప్రభుత్వ ఫీజులు నిర్ధారించింది. ఎస్కేయూ రూ.70వేలు, బెస్ట్ ప్రైవేటు యూనివర్సిటీకి రూ.69500 చొప్పున చెల్లించనుంది. అయితే జేఎన్‌టీయూ అనంతపురం, పులివెందుల, కలికిరి కళాశాలలు. మడకశిర అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రభుత్వానికి సంబంధించినవి కావడంతో రూ.10వేలుగా నిర్ధారించారు.

బీటెక్ ఇంజనీరింగ్‌లో కోర్సుల వారిగా కన్వీనర్ కోటా సీట్ల కేటాయింపు

కోర్సు	సీట్ల సంఖ్య
కంప్యూటర్ సైన్స్	13798
కంప్యూటర్ సైన్స్ అడ్వాన్స్	11443
మెకానికల్	2064
ఎలక్ట్రికల్	2949
ఎలక్ట్రానిక్స్	8493
సివిల్	2016
కమికల్	66
ఫుడ్ టెక్నాలజీ	33
అగ్రికల్చర్	29
మొత్తం	40891

కంప్యూటర్ సైన్స్‌కే అధిక కేటాయింపు

బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులు అత్యధికంగా తమ పిల్లలను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను చేయాలన్న ఆకాంక్షతో ఈ కోర్సువైపే మొగ్గుచూపుతున్నారు. డిమాండ్ పెరగడంతో ఏఐసీటీఈ అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశాలకు ఏకంగా 13798 సీట్లను కేటాయించింది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అడ్వాన్స్ కోర్సులుగా పిలువడే ఏఐ, ఏఐడి, ఏఐఎం, సీఏడీ, సీఏఐ, సీఎస్ఎం, డీఎస్, ఐఎస్ఎఫ్ తదితర వాటికి 11223 సీట్లను కేటాయించింది. కోర్ బ్రాంచ్‌లైన మెకానికల్, సివిల్, ఈఈఈకు పోటీలేకపోవడంతో తక్కువ సీట్లకే పరిమితం చేసింది.

ముగిసిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

బీటెక్ ప్రవేశాలకు ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు వారికి నచ్చిన కళాశాల, బ్రాంచ్(కోర్సు)లను ఎంపిక వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమై శుక్రవారంతో ముగిసింది. అయితే వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్న వారు శనివారం వాటిలో మార్పు, చేర్పులకు అవకాశమిచ్చింది. అయితే ఈ గడువు ముగుస్తుందా? ఇంకా పొడిగిస్తారా? అన్న సందేహాలపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ స్పష్టత ఇవ్వలేదు.

న్యాయవాదులు సీఓపీ వెరిఫికేషన్ చేసుకోవాలి

అనంతపురం క్రైం, జూలై 12: ప్రతి న్యాయవాది సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీఓపీ) వెరిఫికేషన్ చేసుకోవాల్సిందేనని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న న్యాయవాదులు, 2020లో బార్‌కౌన్సిల్ నుంచి సీఓపీ కార్డు పొందిన ప్రతి న్యాయవాది రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ గెజిట్ విడుదల చేసిందన్నారు. ప్రతి న్యాయవాది తమ విద్యార్హత ధ్రువీకరణపత్రాలను బార్ అసోసియేషన్ ఆమోదంతో ఎస్‌బీఐ చలానా రూ.500 చెల్లించి బార్‌కౌన్సిల్ ఆఫ్ ఏపీకి పంపాలన్నారు.

నిస్సార పరీక్షా కేంద్రాలు

- భూసార పరీక్షలు కావాలంటే 'అనంత'కు వెళ్లాల్సిందే..
- మూడు కేంద్రాల మూసివేత
- రైతులకు తప్పని తిప్పలు



ధర్మవరంలో మూతపడిన భూసార పరీక్షాకేంద్రం

ధర్మవరం, జూలై 12: రైతులకు ఎంతో అవసరమైన భూసార పరీక్షా కేంద్రాలను గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. దీంతో రైతులు పంటలు పెట్టే సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవాలంటే నానా తిప్పలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో భూసార, నీటి పరీక్షా కేంద్రాలు పనిచేయకపోవడంతో రైతులు అనంతపురం లేదా ప్రైవేటు పరీక్షా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని శ్రీసత్యసాయి జిల్లాలోని రైతులు వాపోతున్నారు. పొలాల్లో మట్టిసాంద్రత, నీటిలో లవణశాతం తెలుసుకోవాలంటే భూసార పరీక్షా కేంద్రాలకు మట్టి, నీటిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. జిల్లాలో కదిరి, పెనుకొండ, ధర్మవరం డివిజన్ కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ మార్కెట్‌లోని భూసార పరీక్షా కేంద్రాలకు తీసుకెళితే అవి అక్కడ మూతపడి ఉన్నాయని, దీంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండ్ల మొక్కలు, ఇతర పంటలు సాగుచేసే సమయంలో భూసార, నీటి నమూనా పరీక్షలు ఎంతో కీలకం. పరీక్షా కేంద్రాలు మూతపడడంతో ఎంతో వ్యయప్రయాసలకోర్చి అనంతపురంలోని ల్యాబ్‌కు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వం ఆర్బీకే కేంద్రాల ద్వారా నీరు, మట్టి పరీక్షలు రైతుల పొలాల్లోనే నిర్వహిస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. అధికారులు మట్టి పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. భూసార పరీక్షా కేంద్రాలకు నిధులు మంజూరు చేయకపోవడంతో అవి మూతపడ్డాయని ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. వ్యవసాయ అధికారులు భూసార, నీటి పరీక్షలు చేయించుకోవాలని రైతులకు గ్రామ సభల ద్వారా తెలియజేస్తున్నారు. సిబ్బంది మట్టి, నీటిని తీసుకెళుతున్నారని, ల్యాబ్‌లు లేకపోవడంతో వాటి ఫలితాలను తమకు ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. ఆర్బీకేలకు భూసార పరీక్షలకు సంబంధించి నిధులతోపాటు పరికరాలు అందించలేదు. దీంతో తాము మట్టి, నీటి పరీక్షల కోసం అనంతపురం జిల్లాకు పరుగులు తీయాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు అంటున్నారు.

నష్టపోతున్న రైతులు

శ్రీసత్యసాయి జిల్లాలో ప్రధానంగా రైతులు వేరుశనగ, మొక్కజొన్న, దోస, టమోట, కలింగర, ఇతర పంటలను విరివిగాసాగు చేస్తున్నారు. భూసార, నీటి పరీక్షలు చేయించుకోవాలంటేకేంద్రాలు మూతపడ్డాయి. దీంతో రైతులు భూమిలో సూక్ష్మపోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్, ఐరన్ ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలియక అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతుండటంతో సాగు చేసిన పంటలు పండక నష్టపోతున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం భూ సార పరీక్షా కేంద్రాలకు నిధులు కేటాయించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐదేళ్లయినా ల్యాబ్ లేదు

గత ప్రభుత్వంలో వైఎస్ఆర్ అగ్రిల్యాబ్ ద్వారా భూసార, నీటి పరీక్షలు చేస్తామని అధికారులు తెలిపారు. ఐదేళ్లవుతున్నా ఇంతవరకు మండల కేంద్రం కొత్తచెరువులోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఉన్న వైఎస్ఆర్ అగ్రిల్యాబ్ పరీక్షలకు నోచుకోలేదు. దీంతో మట్టి, నీటి పరీక్షల కోసం ఇబ్బందులు పడుతున్నాం.

\- అశోక్, రైతు, కొత్తచెరువు



త్వరలో వినియోగంలోకి తెస్తాం

మైనర్ సమస్యల వల్ల ల్యాబ్‌లు ప్రస్తుతంలో వినియోగంలో లేవు. వాటి మరమ్మతులకు నిర్వహణ నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికను పంపించాం. త్వరలోనే వాటిని వినియోగంలోకి తీసుకు వస్తాం.

\- సుబ్బారావు, జిల్లా వ్యవసాయ అధికారి

దశలవారీగా చేనేతల సమస్యలు పరిష్కరిస్తాం



ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి సవిత



మగ్గాన్ని పరిశీలిస్తూ..

మంత్రి సవిత

హిందూపురం(సోమందేపల్లి), జూలై 12: దశలవారీగా చేనేతల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమందేపల్లిలోని వెంకటేశ్వర కల్యాణమండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చేనేతల ఆత్మీయ సమావేశానికి మంత్రి హాజరయ్యారు. చేనేతలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. మండలంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయడంతో పాటు అర్హులైన వారికి సబ్సిడీతో రూ.5లక్షల రుణం అందిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మరమగ్గాలకు 500యూనిట్లు, చేతిమగ్గాలకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తామన్నారు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు మార్కెటింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఒక బ్యాంకే ఉండటంతో లావాదేవీలకు కష్టంగా మారిందన్నారు. మరో బ్యాంకును ఏర్పాటు చేయాలన్నారు. 2010లో పదివేల మగ్గాలకుపైగా ఉండగా చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోవడంతో చాలావరకు కనుమరుగయ్యాయన్నారు. ముద్రారుణాల ద్వారా విరివిగా లోన్లు అందించడం, కేంద్ర ప్రభుత్వం అందించే రూ.5వేలు రాష్ట్రంలో కూడా అమలు చేయాలన్నారు. చేనేతలకు గుర్తింపు కార్డులను పునరుద్ధరించి అర్హులైన చేనేతలందరికీ రూ.24వేలు ఆర్థిక సాయం, ప్రత్యేక వీవర్స్‌కాలనీ ఏర్పాటు చేయాలన్నారు. చేనేతలు వేసే డిజైన్ల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటుచేసి అప్పుల భారంతో మృతిచెందిన కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించాలన్నారు. బీమా సౌకర్యాన్ని కల్పించాలని పలు డిమాండ్లను ఆమె ముందుంచారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. చేనేతల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందని ఆమె స్పష్టం చేశారు.

మగ్గాలను పరిశీలించిన మంత్రి

సోమందేపల్లిలోని దుర్గానగర్‌లో మల్లికార్జునకు చెందిన చేతిమగ్గాన్ని, నాగరాజుకు చెందిన మరమగ్గాన్ని మంత్రి సవిత పరిశీలించారు. వారు నేసిన చీరలను పరిశీలించారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. త్వరలోనే చేనేతల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలను మంత్రి సవిత తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన ఎలా సాగుతుందని ఆరాతీశారు. మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న రేషన్, కోడిగుడ్లను పరిశీలించారు. ఆయా పాఠశాలలో మౌళిక వసతులు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ రామాంజినేయులునాయక్ స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆమెకు వివరించారు. ఉపాధ్యాయులతో భేటీ అయిన ఆమె నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఆదేశించారు. 117జీఓ రద్దు అంశాన్ని ఉపాధ్యాయులు.. మంత్రి దృష్టికి తెచ్చారు. అక్కడి నుంచి బీసీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన వసతి గృహంలో 18గదులు, ఒకహాల్ ఉండగా కేవలం నాలుగు గదుల్లోనే విద్యార్థులున్నట్లు గుర్తించారు. తహసీల్దార్ అంజనానాయక్, ఎంఈఓలను వివరణ కోరారు. వారు మాట్లాడుతూ.. వసతి గృహం చాలా కాలం వినియోగంలో లేకపోవడంతో దుండగులు తలుపులు, కిటికీలు తస్కరించారన్నారు. హాస్టల్‌లో వసతుల కల్పనకు తోడ్పాటు అందిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం నిరుపయోగంగా ఉన్న మరో హాస్టల్‌ను తనిఖీచేసి దానిని పాఠశాల అవసరాలకు వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు.

అట్టహాసంగా సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం

సందడి చేసిన సినీతారలు.. కేరింతలు కొట్టిన యువత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీతారలు

అనంతపురం కల్చరల్, జూలై 12: జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ సమీపంలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 35వ బ్రాంచి ప్రారంభోత్సవాన్ని శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తోపాటు సినీతారలు అనసూయ భరద్వాజ్, నిధి అగర్వాల్ ముఖ్యఅతిథులుగా హాజరై రిబ్బన్ కట్‌చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం వినాయకుడి ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జిల్లాలో తయారైన పట్టుచీరలను సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ నిర్వాహకులు తీసుకుని విక్రయించి, తయారీదారులకు ఉపాధి కల్పించాలని కోరారు. అదేవిధంగా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. సినీనటులు అనసూయ, నిధి అగర్వాల్ మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో ఉండేలా సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌ను అనంతలో నెలకొల్పడం శుభపరిణామమని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి సినీతారలు వస్తున్నారన్న సమాచారంతో అభిమానులు, యువత పెద్దసంఖ్యలో షాపింగ్‌మాల్ వద్దకు చేరుకున్నారు. సినీతారలు అక్కడికి చేరుకోగానే ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు. మరోవైపు సినీతారలు అనసూయ భరద్వాజ్, నిధి అగర్వాల్‌లు సినిమా పాటలకు డ్యాన్సులు వేస్తూ వీక్షకులను మరింత ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో షాపింగ్‌మాల్ ఎండీలు రాజమౌళి, వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు సురేష్, అభినయ్, మాజీ మేయర్ స్వరూప, మాల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీ తారలు నిధి అగర్వాల్, అనసూయ

రేపటి నుంచి సత్యసాయి క్రికెట్ లీగ్ పోటీలు

పుట్టపర్తి, జూలై 12

శ్రీసత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో ఆదివారం నుంచి సత్యసాయి క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించనున్నారు. భారత్ లెవెన్, గ్లోబల్ లెవెన్ మధ్య ప్రారంభ మ్యాచ్ జరగనుంది. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులతో కలిసి భారత మాజీ క్రికెటర్ మురళీ కార్తీక్ పోటీలను ప్రారంభిస్తారు. సత్యసాయి సేవాసంస్థల సభ్యులు మాత్రమే క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొనడానికి అర్హులు. ఏడాదిపాటు జరిగే ఈ పోటీలు తొలుత సత్యసాయి సమితి స్థాయిలో నిర్వహిస్తారు. తరువాత ఇంటర్ సమితి, జిల్లా, అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర, జోనల్ స్థాయిలలో నిర్వహిస్తారు. 2025 జూలై 14న పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. ఈ స్టేడియంలో 27 ఏళ్ల క్రితం వరల్డ్ లెవెన్, ఇండియా లెవెన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో తొలిసారి జరిగిన ప్రపంచస్థాయి క్రికెట్ పోటీలను వీక్షించడానికి క్రీడాభిమానులు అప్పట్లో ఎగబడ్డారు. భారత్ లెవెన్ జట్టు ఆ మ్యాచ్‌లో విజయం సాధించింది.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ ద్వారా అందించే వైద్యసేవలను షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు ఉపయోగించుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల వారు తీవ్రమైన అనారోగ్యాలు, కిడ్నీ, గుండె, కాలేయం, క్యాన్సర్, మెదడు, అవయవ మార్పిడి, వెన్నెముక శస్త్ర చికత్సతోపాటు ఏదైనా ప్రాణాంతక వ్యాధితో బాధపడుతుంటే ఈ పథకం ద్వారా వైద్య సహాయం అందిస్తారన్నారు. షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగ కమ్యూనిటీకి చెందిన వారు అర్హులన్నారు. శస్త్రచికిత్సకు కనీసం 15 రోజుల ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ డైరెక్టర్, న్యూఢిల్లీకి వివరాలు పంపాలన్నారు. చికిత్స అంచనా వ్యయంలో 100 శాతం నేరుగా సంబంధిత ఆస్పత్రికి నెఫ్ట్ లేదా ఆర్‌టీజీఎస్ ద్వారా సీలింగ్ పరిమితితో విడుదల చేస్తారన్నారు. గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో ఈ వైద్య చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు ambedkarfoundation.nic.in వెబ్‌సైట్ లేదా అనంతపురంలోని ఎస్సీ సంక్షేమశాఖ, తాడిపత్రి, అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి, ఉరవకొండలోని సాంఘిక సంక్షేమ అధికారులను సంప్రదించాలన్నారు.

చీనీకాయలు టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్, జూలై 12: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 944 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.48

అనంతపురం రూరల్, జూలై 12: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.48తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 83 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.42, కనిష్ఠ ధర రూ.33 పలికినట్లు ఆయన తెలిపారు.

టీబీ డ్యాంలో 29 టీఎంసీల నీరు



టీబీ డ్యాంలో నీటి నిల్వ

బొమ్మనహాళ్, జూలై 12: తుంగభద్ర జలాశయంలోకి శుక్రవారం 29.161 టీఎంసీలు చేరాయి. శుక్రవారం ఉదయానికి 21,643 క్యూసెక్కులకు చేరింది. కొద్ది రోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చు తగ్గుల మధ్య కొనసాగుతుంది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 29.161 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి. అవుట్‌ఫ్లో 205 క్యూసెక్కులుండగా 1633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1605.28 అడుగుల వరకు నీరు చేరింది.

కోర్టులో లొంగిపోయిన నిందితుడు

టీడీపీ కార్యకర్త ఆదెప్ప హత్యకేసు..



కేశవరెడ్డిని రిమాండ్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్, జూలై 12

రాయదుర్గం మండలం మెచ్చిరి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఆదెప్ప ఈనెల 9వ తేదీన దారుణ హత్యకు గురయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ నిందితుడు పోలీసులకు దొరకలేదు. శుక్రవారం రాత్రి నిందితుడు మెచ్చిరి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కేశవరెడ్డి న్యాయవాదుల ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ కోర్టులో లొంగిపోయాడు. న్యాయాధికారి సుభాన్ నిందితుడికి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. నిందితుడి ఫొటోలను విలేకరులు తీస్తుండగా.. పోలీసులు అడ్డుపడ్డారు.

ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

● న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్

అనంతపురం క్రైం, జూలై 12: ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా న్యాయాధికారి హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనతో కలిగే నష్టాలు, జరిమానాల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, న్యాయవాది హరికృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామకృష్ణ, ఫాతిమున్నీసా బేగం, రమణనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీవద్దు: డీడీ



జడ్పీ పాఠశాలలో గుడ్లను పరిశీలిస్తున్న మత్స్యశాఖ డీడీ

గార్లదిన్నె, జూలై 12: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పెడుతున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌నాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఎంఈఓ వెంకటరమణ నాయక్‌లతో కలసి ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ఎంత మంది పిల్లలున్నారు, మెను ప్రకారం భోజనం పెడుతున్నారా అని భోజన నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత లేకుండా భోజనం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, ఉపాధ్యాయుడు సుంకన్న పాల్గొన్నారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

చెన్నేకొత్తపల్లి, జూలై 12: మండలంలోని ఎన్‌ఎస్‌గేటు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గత నెల 21న జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన ప్రైవేటు బస్సులు, 407 వ్యాన్‌లో ఐదుగురు డ్రైవర్లపై దాడి చేసి రూ.20వేలు నగదును దుండగులు దోచుకుని పరారైన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి వివరాలను శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్‌ఐలు వెల్లడించారు. ఎన్‌ఎస్‌గేటు 44 జాతీయ రహదారిపై గస్తీని నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఎన్‌ఎస్‌గేటు సర్కిల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. ధర్మవరం మండలం గొట్లూరుకు చెందిన జలధర్ కుమార్, ధర్మపురికి చెందిన గుజ్జలముకుంద, గుజ్జల దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేసి విచారించగా నేరాన్ని అంగీకరించారన్నారు. దోచుకున్న రూ.20వేల నగదును తాము ధర్మవరంలో తిరుగుతూ వాడుకున్నామని తెలిపారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు వారు తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరికి గాయాలు

నార్పల, జూలై 12: మండలంలోని గూగూడు గ్రామంలో ఇద్దరు వ్యక్తులు అతిగా మద్యం సేవించి శుక్రవారం డబ్బు విషయమై ఘర్షణ పడ్డారు. ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. గోరంట్లకు చెందిన లక్ష్మీకాంత్, నాగరాజు అనే ఇద్దరు స్నేహితులు గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చారు. స్వామి దర్శనం అనంతరం బ్రాందిషాపులో అతిగా మద్యం సేవించి డబ్బు విషయమై ఒకరికొకరు దుర్భషలాడుకున్నారు. కోపోద్రికుడైన లక్ష్మీకాంత్ తన చేతిలో ఉన్న బీర్ సీసాతో నాగరాజు తలపై విచక్షణా రహితంగా కొట్టాడు. ఘర్షణలో నాగరాజు తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆయనను 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

మొక్కలు నాటి.. సంరక్షించాలి



మొక్క నాటుతున్న అటవీశాఖ సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, జూలై 12: మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అటవీశాఖ రేంజర్ శ్రీనివాసులు సూచించారు. నగర శివారులోని సెయింట్ డీపాల్ స్కూల్‌లో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టారు. ముఖ్య అతిథులుగా రేంజర్ శ్రీనివాసులుతో పాటు స్కూల్ యాజమాన్యం హాజరైంది. స్కూల్ ఆవరణలో పండ్ల మొక్కలు నాటించారు. అనంతరం రేంజర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటి సంరక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకున్నప్పుడే పచ్చదనం పెంపొందించుకోగలుగుతామన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మారేప్ప, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ గిరీష్‌తోపాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ పార్క్ పరిరక్షణ.. హర్షణీయం

అనంతపురంరూరల్, జూలై 12: నగరంలోని సెంట్రల్ పార్క్ పరిరక్షణకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నడుం బిగించడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెంట్రల్ పార్క్ స్థలాన్ని కొంతమంది వైసీపీ నాయకులు ఆక్రమించారని మండిపడ్డారు. పార్క్ పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, జూలై 12: నగరంలోని శ్రీనగర్ కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ టౌన్-2 డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శ్రీనగర్ కాలనీ, బ్యాంక్ కాలనీ, సవేరా ఆస్పత్రి, మంగళవారి కాలనీ, 80 అడుగుల రోడ్డు, రాంనగర్, రిజిస్టర్ ఆఫీస్, రుద్రంపేట బైపాస్, మారుతి నగర్, వెంకటరావు నగర్, సంఘమిత్ర కాలనీ, ఆదర్శనగర్, మారుతి నగర్ ఎక్స్‌టెన్షన్, ఐశ్వర్యకాలనీ, అయ్యప్పస్వామి టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తహసీల్దార్ కార్యాలయాలకు మోక్షమెన్నడో..?

● నిర్మాణాలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం
● టీడీపీ హయంలోనే నిర్మాణాలకు అనుమతులు
● ఇబ్బంది పడుతున్న ప్రజలు, అధికారులు

అనంతపురం రూరల్, జూలై 12: ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను గత ప్రభుత్వం విస్మరించింది. అనుమతులు లభించిన కార్యాలయాలను కూడా పట్టించుకోలేదు. ఇందుకు నిదర్శనం అనంతపురం తహసీల్దార్ కార్యాలయం. గత టీడీపీ హయాంలో కార్యాలయ నిర్మాణానికి అనుమతులు కూడా లభించాయి. అయితే అధికారం కోల్పోవడంతో నిర్మాణం మరుగునపడింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆ పార్టీ జిల్లా కార్యాలయం నిర్మాణంపై ఉన్న శ్రద్ధ కొంతలో కొంతైనా అప్పటి ప్రజాప్రతినిధులకు ఉండుంటే నూతన కార్యాలయం పూర్తి అయ్యేది. ప్రజలకు మేలు జరుగుండేది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చింది. మరోమారు నూతన కార్యాలయ నిర్మాణంపై ఆయా వర్గాల్లో ఆశల కలలు మొదలయ్యాయి. ఈక్రమంలోనే నూతన కార్యాలయాల నిర్మాణం జరిగితే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టీడీపీ హయాంలోనే అనుమతులు..

టీడీపీ హయాంలోనే తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. రూ.రెండుకోట్లకు పైగా నిధులు కూడా మంజూరయ్యాయి. జిల్లా కేంద్రంలోని టవర్ క్లాక్ సమీపంలో పాత తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో నూతన కార్యాలయాలు చేపట్టాలని నిర్ణయించారు. అక్కడున్న



పాత ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ప్రాంతం



ఈ భవనంలోనే రెండు కార్యాలయాల నిర్వహణ

పాత భవనాలను తొలగించారు. నిర్మాణాలు జరుగుతాయన్న సమయంలో ఎన్నికలు వచ్చాయి. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి నిర్మాణం గురించి పూర్తిగా విస్మరించింది. ఈ మధ్యలో స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు కూడా యత్నించారు. విషయం బయటకు పొక్కడం ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేపట్టడంతో కబ్జాదారుల అడుగులు వెనకుపడ్డాయి.

భూత్ బంగ్లాను తలపిస్తున్న ప్రస్తుత కార్యాలయాలు..

ప్రస్తుతం అనంతపురం అర్బన్, రూరల్ మండలాలకు ప్రాంతాలకు వేరువేరుగా ఏడాది కిందట తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. హెచ్ఎల్‌సీ కాలువ వద్ద కార్యాలయాలున్నాయి. ఆ కార్యాలయాలు ప్రజలు సేవలకు ఇబ్బందిగా మారాయి. కార్యాలయాలకు వెళ్లాలంటే వందల రూపాయాలు ఆటోలకు జనం ఖర్చు చేసుకుంటున్నారు. మరీ ముఖ్యంగా రూరల్ ప్రాంతాల ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతమనే చెప్పాలి. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఉన్న భవనంలో రెండుమండలాలకు వేరుగా వేరుగా కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆ భవనం భూత్ బంగ్లాను తలపిస్తోంది. ఎప్పుడు పెచ్చులు ఊడుతాయో.. భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. కొత్త భవనాలు ఏర్పాటు చేస్తే ఇటు కార్యాలయంలో పనిచేసేవారికి, ప్రజలకు మేలు జరిగే వీలుంటుంది. గతంలో అర్బన్, రూరల్ ప్రాంతాలకు ఒకటే కార్యాలయం ఉండటంతో టవర్‌క్లాక్ వద్దనున్న పాత తహసీల్దార్ కార్యాలయం ప్రాంతంలో నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం వేరు..వేరుగా కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. అర్బన్ కార్యాలయాన్ని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చేపట్టినా..రూరల్ ప్రాంతానికి ఎక్కడ చేపడుతారో తెలియని పరిస్థితి. రెండింటికీ అక్కడే నూతన భవనాలు నిర్మాణం చేసినా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

పంచాయతీలకు నిధులు విడుదల చేస్తాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురంరూరల్, జూలై 12: గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవం లేకుండా పోయిందని, ఇక నుంచి అలా ఉండదన్నారు. ప్రజాప్రతినిధులకు దక్కాల్సిన గౌరవం దక్కుతుందని అన్నారు. ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు జడ్పీటీసీ చంద్రకుమార్, వైస్ ఎంపీపీలు క్రిష్ణారెడ్డి, బాలాజీ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా పక్కదారి పట్టించారన్నారు. దీంతో సర్పంచులు, ఎంపీటీసీలు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాయతీలకు రూ.250 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. హెచ్చెల్సీ నుంచి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

నీరు విడుదల కానున్న నేపథ్యంలో పూడికతీత, ముళ్లకంపల తొలగింపు వంటివి చేస్తామన్నారు. విద్యుత్ అధికారులు సమస్యలపై స్పందించడం లేదని ప్రస్తావించారు. ఎంపీడీఓ పుల్లయ్య, మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నీటి కుంటలో గంబూషియా చేపలు వదులుతున్న మలేరియా అధికారి

రాప్తాడు, జూలై 12: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా అధికారి ఓబులు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని నీటి కుంటల్లో గంబూషియా చేపలు వదిలారు. ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, ఫైలేరియా తదితర విషజ్వరాలకు కారణమయ్యే దోమలు నీటి కుంటల్లో వృద్ధి చెందుతాయన్నారు. రాప్తాడు, మరూరు, బండమీదపల్లి గ్రామాల్లోని నీటి కుంటల్లో చేపలు వదిలారు. అనంతరం రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, వైద్యాధికారి శివకృష్ణ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్, జూలై 12: మండలంలోని పాపంపల్లికి చెందిన మంజునాథ్ చౌదరి (30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి తల్లి గౌరమ్మ కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ... మంజునాథ్ చౌదరి కొన్నేళ్లుగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం రాత్రి పది గంటల సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. భోజనం చేసి ఆ తర్వాత ఇంటి ఆరుబయట నిద్రించాడు. తల్లి, సోదరి అనిత ఇంట్లోనే నిద్రించారు. కాగా శుక్రవారం ఉదయం అతను ఎంతసేపటికీ నిద్రలేవలేదు. అనుమానం వచ్చి తల్లి తట్టి లేపేందుకు యత్నించింది. ఎంతకీ లేవకపోవడంతో బంధువుల సాయంతో వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి ఆటోలో తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంటనే తల్లి తన కుమారుడి మృతి పట్ల అనుమానం ఉన్నట్లు కళ్యాణదుర్గం సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసింది. కుమారుడికి ఎవరైనా ప్రమాదం తలపెట్టారేమోనని ఆమె అనుమానం వ్యక్తం చేస్తోంది. నెల రోజుల క్రితం పక్క గ్రామంలో మంజునాథ చౌదరి చిన్నపాటి ఘర్షణకు దిగాడని తెలుస్తోంది. పోలీసులు, వైద్యులు మాత్రం అతను వాంతులు చేసుకోవడంతో గుండెనొప్పితో మరణించి ఉండవచ్చునని చెబుతున్నారు. తన కుమారుడు ఎటువంటి అనారోగ్యానికి గురికాలేదని, మృతిపై అనుమానాలున్నాయని, దర్యాప్తు చేపట్టాలని తల్లి ఫిర్యాదులో కోరింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృ తదేహానికి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు అవివాహితుడు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి: డీఎస్పీ

పుట్లూరు, జూలై 12: మండలంలో మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ వెంకటశివారెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా ఘటనలు జరిగితే ముందుగా తమసిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ హేమాద్రి, ఆయా గ్రామాల నిర్వాహకులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన అర్బన్ బ్యాంకు చైర్మన్



డీజీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న జేఎల్ మురళీధర్, రాయల్‌మురళి తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 12: ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావును శుక్రవారం అమరావతిలోని ఆయన కార్యాలయంలో ది అనంతపూర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జేఎల్ మురళీధర్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడేందుకు డీజీపీ చేస్తున్న కృషిని అభినందించారు. టీడీపీ నాయకులు రాయల్ మురళి, కాయగూరల శ్రీధర్ పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు



మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న గడ్డం సుబ్రహ్మణ్యం

అనంతపురం అర్బన్, జూలై 12: వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అచ్చెన్నాయుడుకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని సచివాలయంలో మంత్రిని గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న వైద్య సిబ్బంది

శింగనమల జూలై 12: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం శింగనమల మండల వైద్యాధికారి శంకర్‌నాయక్ వైద్య సిబ్బంది ఎమ్మెల్యే స్వగృహంలో ఆమెను మార్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యులకు సూచించారు.

సర్వజన ఆస్పత్రిలో కార్పొరేషన్ కమిషనర్ తనిఖీ

అనంతపురం టౌన్, జూలై 12: జిల్లా సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం ఆస్పత్రిలోనే ఉంటూ క్యాజువాలిటీ, ఎఫ్ఎం, ఎంఎం వార్డులు, గైనిక్, చిన్నపిల్లలవార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధ



చిన్నపిల్లల వార్డులో వైద్యసేవలు గురించి ఆరాతీస్తున్న కమిషనర్

నల మేరకు అక్కడ వసతులు ఉన్నాయా? డాక్టర్లు, సిబ్బంది ఉంటున్నారా? రికార్డుల ఆధారంగా పరిశీలించారు. అనంతరం నేరుగా ఆయా వార్డులలో చికిత్స పొందుతున్న రోగులతో ఆయన స్వయంగా మాట్లాడారు. డాక్టర్లు, సిబ్బంది వస్తున్నారా? సక్రమంగా వైద్యసేవలు అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో కొన్ని వార్డులలో ఒకరిద్దరు సరిగా పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేయగా, ఇంకొందరు బాగా చూస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. క్యాజువాలిటీకి వచ్చే రోగులకు సరిపడడం లేదని, పారిశుధ్యం, సెక్యూరిటీ ఎవరు చేస్తున్నారని ఆరా తీశారు. ఆస్పత్రి ఆవరణలో సరైన రహదారులు లేకపోవడంతో ఇంటర్నల్ రోడ్ల ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానన్నారు. ఇతర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసికెళతానన్నారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఆస్పత్రికి వచ్చిన రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

భూపోరాట యోధుడు వెంగమనాయుడు



వెంగమనాయుడు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, జూలై 12: పేద, బడుగు, బలహీనవర్గాల తరపున భూ పోరాటాలు చేసిన గొప్ప యోధుడు వెంగమనాయుడని సీపీఐ నాయకులు కొనియాడారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన వెంగమనాయుడు 27వ వర్ధంతిని నిర్వహించారు. జగదీష్, సీనియర్ నేతలు రవీంద్రనాథ్, జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ వెంగమనాయుడు భూదాన ఉద్యమంలో, వ్యవసాయ కూలీలకు రేట్లు పెంచేందులకు అనేక ఆందోళన కార్యక్రమాల్లో స్ఫూర్తిదాయక ఉద్యమాలు చేశారన్నారు. 22 ఏళ్ల పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా సీపీఐ కార్యదర్శిగా పనిచేసి గ్రామాల్లో అనేక శాఖలు ఏర్పాటుచేయించారన్నారు. జాఫర్ మాట్లాడుతూ... నిర్బంధాలకు సైతం ఎదురొడ్డి పార్టీ కార్యకర్తలకు ధైర్యాన్ని అందించారన్నారు. ఆ పార్టీ నాయకులు ఝాన్సీ వెంగమ నాయుడి తనయుడు అజయ్‌కుమార్, ఈశ్వర్‌రెడ్డి, లింగమయ్య, రమణయ్య, సంతోష్‌కుమార్, కుళ్లాయిస్వామి, రమణ, అల్లిపీరా, రమేష్, నారాయణస్వామి, సుందరరాజు, గాదిలింగప్ప, మున్న, రాజు, నాగప్ప పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 24 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కంపెనీ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్, జూలై 12: ఎస్సీ డిగ్రీ కళాశాలకు చెందిన 24 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వరించాయి. పీపుల్ టెక్ గ్రూప్ కంపెనీ ఆధ్వర్యంలో కళాశాలలో శుక్రవారం కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి సమక్షంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు 75 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి తొలుత గ్రూప్ డిస్కషన్, అనంతరం వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించారు. పీపుల్ టెక్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు భాస్కర్, అక్షయ, దివ్యారెడ్డి, సురేష్, సూరజ్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టి, 24 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ యన్‌వీ ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి సాయిరాం, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ పరీక్షలో 90శాతం ఉత్తీర్ణత

● అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అనంతరాముడు



విద్యార్థులను అభినందిస్తున్న అనంతరాముడు

అనంతపురం సెంట్రల్, జూలై 12: పాలిటెక్నిక్ పరీక్షల్లో 90శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం హర్షణీయమని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అనంతరాముడు అన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం చైర్మన్, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు మెమెంటోలు, నగదు బహుకరించి అభినందించారు. వారు మాట్లాడుతూ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సులను ప్రవేశపెట్టిన మొదటి సంవత్సరంలోనే ఈసీఈ, సీఎస్ఈ బ్రాంచ్‌ల విద్యార్థులు 90శాతం అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులయ్యారన్నారు. మెరుగైన వసతులు కల్పించి, నాణ్యమైన బోధన అందిస్తూ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. కళాశాలపై నమ్మకంతో తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పిస్తున్నారని అందుకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ వారి ఆకాంక్షలు నెరవేరుస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్ర నాయుడు, పురుషోత్తం, హరినాథ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 12: రోటరీపురంలోని అభయ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ఫౌండేషన్ నిర్వాహకులు పావన, భార్గవ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయుర్వేద థెరపీ, మొబైల్ రిపేరీ, డ్రైవింగ్, టైలరింగ్, బ్యుటీషియన్, కంప్యూటర్స్, హోమ్ కేర్ నర్సింగ్, శారీ టై అండ్ డయ్ తదితర కోర్సులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకుంటే.. ఎంపిక చేసి వారికి ఉచిత వసతి, భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణ తరువాత ధ్రువపత్రాలు, టూల్ కిట్స్ తదితర వస్తువులు 50 శాతం సబ్సిడీతో అందిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు క్యాంపస్‌లో కానీ లేదా ఫౌండేషన్ నిర్వాహకులు పావన 7095537244, భార్గవ్ 9701241487కు సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

గడ్డి విత్తానాల పంపిణీ



రైతులకు గడ్డి విత్తానాలు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

శింగనమల జూలై 12: అర్హులైన ప్రతి పాడి రైతుకు ఉచితంగా గడ్డి విత్తనాలు అందజేస్తామని శింగనమల పశువైద్య శాఖ ఏడీ పద్మనాభం తెలిపారు. శింగనమల నియోజకవర్గంలో రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాలమేరుకు మండలంలో గడ్డి విత్తనాలు అర్హత కల్గిన రైతులకు అందిస్తామన్నారు. శుక్రవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు వెంకటేశ్, బండి వెంకటనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి పరిశీలన

కళ్యాణదుర్గంరూరల్, జూలై 12 : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ముప్పూరి దేవరాజు, నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రిలో అపరిశుభ్రత ఉండడాన్ని గమనించి సమస్యను ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రసన్న భారతి దృష్టికి తీసుకెళ్లారు. ఓపీ కోసం ఎక్కువ సమయానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పవన్ యాదవ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

కణేకల్లు, జూలై 12: మండలంలోని కళేకుర్తి వేదావతి హగరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఉరవకొండ మండలం పెద్దముష్టూరుకు చెందిన కొంతమంది అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందని, సొల్లాపురం వద్ద వాటిని పట్టుకుని సీజ్ చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పిచ్చికుక్క దాడిలో వృద్ధుడికి గాయాలు

గుత్తిరూరల్, జూలై12: మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో పిచ్చికుక్క దాడిలో సంజప్ప అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. సంజప్ప గురువారం రాత్రి ఇంటి వద్ద కూర్చొని ఉండగా .. పిచ్చి కుక్క మీదపడి విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచి పారిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడిపై పోక్సో కేసు

ఉరవకొండ, జూలై12: వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన భాస్కర్ అనే యువకుడు ఓ మైనర్ బాలికను నమ్మించి మోసం చేశాడు. మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. విషయాన్ని కుటుంబసభ్యులు గమనించి బాలికతో కలిసి పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం భాస్కర్‌పై పోక్సో కింద కేసు నమోదు చేశారు.

కాలవ సన్మాన సభకు తరలిరండి

రాయదుర్గం, జూలై 12: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమితి ఆధ్వర్యంలో ఈనెల14వ తేదీ ఆదివారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు సన్మాన సభ జరగనుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సమైక్యాంధ్ర భవనంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బళ్లారిరోడ్డులోని కురిహినశెట్టి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు సన్మాన సభ జరగనుందని, ఉద్యోగులందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నిర్వహించారు. జేఏసీ అధ్యక్షులు నారాయణ, నాయకులు కిషోర్, జీ పరమేశ్వరప్ప, ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఎన్జీయూ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గేదెలు మృతి

రాయదుర్గం, జూలై 12: పట్టణ సమీపంలోని పైతోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. పైతోట గ్రామానికి చెందిన అంజనేయులు పాడిగేదెలను పెంచుతూ జీవనాన్ని సాగిస్తున్నాడు. కాగా శుక్రవారం గేదెలు మేతకు వెళ్లి వస్తుండగా.. గ్రామ సమీపంలోని రోడ్డుపై మొలకాల్మూరు వైపు నుంచి కారు వేగంగా వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మిగిలిన రెండు తీవ్రంగా గాయపడి కొట్టుమిట్టాడుతూ మృతి చెందాయి. పాడిగేదెలు మృతి చెందడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపు రూ. రెండు లక్షల వరకు నష్టం వాటిల్లునట్లు వాపోయాడు.

ఆర్బీకే నిర్మాణ బిల్లుల కోసం ఇరువర్గాల వాగ్వాదం

బొమ్మనహాళ్, జూలై 12: మండలంలోని దేవగిరి గ్రామంలో రైతుభరోసా కేంద్రం భవన నిర్మాణ బిల్లు విషయంలో శుక్రవారం వైసీపీ నాయకుల మధ్య వివాదం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. గ్రామానికి చెందిన సర్పంచ్ రాధిక భర్త, వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్, అదే గ్రామానికే చెందిన శ్రీనాథ్ కలిసి ఆర్బీకే, గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు చేశారు. దీంతో వాటి బిల్లుల విషయంలో కొంతకాలం నుంచి ఇరువురు మధ్య వాదనలు జరుగుతున్నాయి. ఎన్నికలు ఫలితాలు అనంతరం వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్ గ్రామంలోకి రాకుండా హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. శుక్రవారం గ్రామానికి రావడంతో.. విషయం తెలుసుకున్న శ్రీనాథ్‌తో పాటు వారి కుటుంబసభ్యులు రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లారు. తనకు రావాల్సిన రూ. 6.30 లక్షలు ఇవ్వాలని రాజ్‌కుమార్‌ను నిలదీశారు. మీకేమి సంబంధం లేదని రాజ్‌కుమార్ చెప్పడంతో ఇరువురు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మాటమాటా పెరిగి రచ్చకు దారి తీసింది. చాలా రోజుల తర్వాత సర్పంచ్ భర్త గ్రామానికి వచ్చారని గ్రామస్థులు కూడా సమస్యలపై ఆయన ఇంటికి వెళ్లారు. గ్రామంలో తాగునీటి సమస్యతో, అపరిశుభ్రతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిలదీశారు. దీంతో రాజ్‌కుమార్ వైసీపీ అధికారంలో లేదని నేను ఇప్పుడేమి చేయించలేనని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ప్రజలంతా ఆయన ఇంటి చుట్టూ గుమిగూడడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువురిని చెదరగొట్టి పంపించేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కుందుర్పి, జూలై 12 : రెండు రోజుల క్రితం నీటికుంటలో పడి ఒకరు, అతనిని కాపాడేందుకు వెళ్లి మరొకరు మృత్యువాత పడిన విషయం విధితమే. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అల్లుడు దేవినేని ధర్మతేజ శుక్రవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే కొద్ది రోజుల క్రితం జర్నలిస్టు నరసింహమూర్తి భార్య వరలక్ష్మి మృతిచెందగా.. ఆ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మండల కన్వీనర్ ధనుంజయ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

బెళుగుప్ప, జూలై 12: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. ఎర్రగుడిలో డ్రైనేజీలో పూడికతీత పనులు చేపట్టి బ్లీచింగ్ పౌడరు చల్లారు. బెళుగుప్పలో వినాయక వీధి బీసీ కాలనీలో డ్రైడే నిర్వహించి , దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో సుబ్బరాజు, ఈవోఆర్డీ మాధవరెడ్డి, గ్రామ కార్యదర్శులు శంకర్, వెంకటేశులు, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ, రాజన్న, చిరంజీవి, రఘు, అశోక్ పాల్గొన్నారు.

కొనసాగిన జ్ఞానయజ్ఞ మహోత్సవం

తాడిపత్రి, జూలై12: పట్టణంలోని నంద్యాలరోడ్డులో ఉన్న ఎస్ఎల్ఎన్ వరహాలు గార్డెన్స్‌లో రెండోరోజు శుక్రవారం భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవ వేడుకలు కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రాతఃకాల ఆరాధన, గోపూజ, సేవాకాలం, అర్చన, అగ్నిమదనం, అగ్నిప్రతిష్ఠ, భాగవత సప్తాహహవనం, పూర్ణాహుతి, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అహోబల రామానుజజీయర్ స్వామి వారు ప్రవచనాలు బోధించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రవచనాలను ఆలకించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు, జూలై12: విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ , భవితకేంద్రాలతో పాటు ఆదర్శ పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులకు ఇబ్బందులు పడ్డారన్నారు. మధ్యాహ్నభోజనం కూడా నాణ్యతలేకపోవడం వల్ల అనారోగ్యం పాలయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు వసతులు మెరుగుపడ్డాయన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా చేసి నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు ప్రతి పాఠశాలలోనూ తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. అనంతరం ఆదర్శపాఠశాలలోని హాస్టల్‌ను ఆమె తనిఖీ చేశారు. కూరగాయలు తెచ్చే ఏజెన్సీని మారుస్తామని సిబ్బందికి తెలిపారు. తర్వాత ఎస్సీకాలనీకి వెళ్లి సమస్యల్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు జీసీ బాబు, శివశంకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రవికుమార్‌రెడ్డి, చెన్నారెడ్డి, రామచంద్రారెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణి

వెంగమనాయుడికి ఘన నివాళి

తాడిపత్రి, జూలై 12: పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వెంగమనాయుడు చేసిన సేవలు వెలకట్టలేనివని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ తెలిపారు. పట్టణంలోని నెహ్రూపార్కు, రంగప్పకాలనీల్లో శుక్రవారం వెంగమనాయుడు వర్ధంతిని వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి గ్రామంలో రైతు కుటుంబంలో వెంగమనాయుడు జన్మించారన్నారు. సీపీఐలో చేరినప్పటి నుంచి మరణించే పేదల కోసం ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నాగరంగయ్య, బాలనాయుడు, ఓబులేసు పాల్గొన్నారు.



గుత్తిలో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

యాడికి: మండలకేంద్రంలో వెంగమనాయుడు చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆపార్టీ నియోజకవర్గ సహాయక కార్యదర్శి వెంకటరాముడు, మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ , మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, నాయకులు పాల్గొన్నారు.

కూడేరు : మండలకేంద్రంలో వెంగమనాయుడు వర్ధంతిని సీపీఐ నాయకులు నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలుల వేసి నివాళుర్పించారు. నాయకులు మల్లికార్జున, శ్రీరాములు, పీరా, మలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలో సీపీఐ కార్యాలయంలో వెంగమనాయుడి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రాజు, మండల కార్యదర్శి రామదాసు, నాయకులు పాల్గొన్నారు.

గుంతకల్లు టౌన్: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వెంగమనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి , పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, నాయకులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలో వెంగమనాయుడు చిత్రపటానికి సీపీఐ నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. తాలూకా కార్యదర్శి నాగార్జున, నాయకులు గురుస్వామి, తిప్పేస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



గుంతకల్లులోని పెద్ద పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లు

గుంతకల్లు టౌన్, జూలై 12: మొహర్రం సందర్భంగా పట్టణంలోని రెడ్డివీధి, ఆంథోని స్ట్రీట్, భాగ్యనగర్, పాతగుంతకల్లుతో పాటు పలు కాలనీల్లో గల పీర్లచావిడిలలో పీర్లు కొలువుదీరాయి. గురువారం రాత్రి పీర్ల చావిడిల నుంచి ముజావర్లు పీర్ల పెట్టెలను పూలతో అలంకరించి మేళతాళాల మధ్య పుర వీధుల్లో ఊరేగించారు. తర్వాత పీర్లను వెండిగొడుగులు తదితరాలతో అలంకరించి చావిడిలలో కొలువుదీర్చారు. భక్తులు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల చావిడిలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

రాయదుర్గం టౌన్: పట్టణంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. లడ్డు వారి పీర్ల చావిడిలో పీర్లు కొలువుదీరాయి. ఈ నెల 14న చిన్న సరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు, 17న జలధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు లడ్డు ఖాసీం, లడ్డు మహమ్మద్‌షఫీ, చమ్మ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

బొమ్మనహాళ్: మొహరం వేడుకలు మండలవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లోని పీర్లచావిడిలలో పీర్లను కొలువుదీర్చారు. అలాగే ఎదురుగా అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. మండలకేంద్రంతో పాటు ఉద్దేహాళ్, ఉంతకల్లు, కురవళ్లి, గోవిందవాడ, దర్గాహోన్నూరు. కల్లుహోళ, గోనేహాళ్, శ్రీధరఘట్ట తదితర గ్రామాల్లో పీర్లను ముజావర్లు కొలువుదీర్చారు.

మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోండి

పుట్లూరు/ యల్లనూరు, జూలై12: మండలంలో మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ వెంకటశివారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా ఘటనలు జరిగితే ముందుగా తమసిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ హేమాద్రి, ఆయా గ్రామాల నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కూడా ఆయన గ్రామాల పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.

రైతు బజార్ ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్, జూలై12: పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుడు ధర్మతేజ, ఆర్డీఓ రాణిసుష్మిత రైతు బజార్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మతేజ మాట్లాడుతూ నాణ్యమైన బియ్యం, కందిపప్పు పేదలకు తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం మిల్లర్లతో చర్చించి ప్రతి రిటైల్ దుకాణాల వద్ద రైతు బజార్ ఏ ర్పాటు చేసిందన్నారు. ఇందులో కిలో కందిపప్పు రూ. 160కు, సోనా మసూరి బియ్యం రూ. 49కు ప్రభుత్వం విక్రయించనుందని తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న ధర్మతేజ, ఆర్డీవో రాణి సుష్మిత

రాయదుర్గంరూరల్: పట్టణంలోని కణేకల్లు రోడ్డులో గల రిలయన్స్ మార్ట్‌లో రైతు బజార్‌ను ప్రారంభించినట్లు సీఎస్‌డీటీ శ్యాంసుందర్ సుదర్శనాచారి పేర్కొన్నారు. రిలయెన్స్ మార్ట్‌లో తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం, కందిపప్పు అమ్మకాలను ప్రారంభించారు. గ్రామీణం, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఉమేష్ పాల్గొన్నారు.

ఉరవకొండ : ధరల అదుపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తహసీల్దారు దస్తగిరి పేర్కొన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో కిరాణ మర్చెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైతుబజార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు బజారులో నాణ్యమైన సన్నబియ్యం, కందిపప్పు తక్కువ ధరకే లభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌డీటీ అంబక్క, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వో పెన్నహోబిలేశు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెరుగన్నం

పెద్దవడుగూరు, జూలై12: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం మధ్యాహ్న భోజనంతో పాటు అదనంగా పెరుగన్నం వడ్డించారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆదేశాలమేరకు ఆ పాఠశాలలోని విద్యార్థులకు రోజూ పెరుగన్నం అందించనున్నట్లు తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి తెలిపారు. అలాగే చిన్నవడుగూరు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు చికెన్ వడ్డించారు. ఈ విద్యార్థులకు రోజూ ఒక పండుతో పాటు నెలలో ఒక రోజు చికెన్ అందించనున్నట్లు ఆయన చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

యాడికి, జూలై12: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు తెలిపారు. మండలకేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్-4లో శుక్రవారం ఆయన తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజనానికి ఉపయోగిస్తున్న సరుకులను, కోడిగుడ్లను పరిశీలించారు. పాఠశాలలో రికార్డులను తనిఖీచేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. భోజన ఏజెన్సీ నిర్వాహకులు వంట చేసే ప్రాంతంలో పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మధ్యాహ్నభోజనాన్ని ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ కార్యాలయ సూపరిండెంట్ నాగేశ్వరరెడ్డి ఉన్నారు. తహశీల్దార్ మోహనవల్లి, డిప్యూటీ తహశీల్దార్ బాలమ్మ పాల్గొన్నారు.

పారితోషికం ఇప్పించాలని వినతి

గుంతకల్లుటౌన్,జూలై12: 2021 సంవత్సరం నుంచి ఎన్నికల వరకు పనిచేశామని, ఇందుకు పారితోషికం ఇప్పించాలని కోరుతూ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డికి శుక్రవారం అర్బన్ బీఎల్వోలు వినతి పత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ అర్బన్‌లో సచివాలయ కార్యదర్శులు 120 మంది బీఎల్వోలుగా పనిచేస్తున్నామన్నారు. నాలుగేళ్లుగా ఒక్క రూపాయి చెల్లించలేదన్నారు. తాము కష్టపడి విధులు నిర్వహించామని, పారితోషికం ఇవ్వకుండా తమ పొట్ట కొట్టడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఇప్పటికైనా పారితోషికం ఇప్పించాలని ఆర్డీఓను కోరారు. విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీఓ చెప్పారని బీఎల్వోలు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఎల్వోలు వరప్రసాద్, శంకరయ్య, నాగన్న, ఫయాజ్, పుష్పమి, తసీమ్, భాగ్యలక్ష్మి, భావని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు, జూలై12: పట్టణంలోని వివిధ విద్యుత్ సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ రంగస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పట్టణంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

యల్లనూరు: మండలంలో శనివారం ఐదుగంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11గంటలకు వరకు విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా సరఫాను నిలిపివేస్తామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పుట్లూరు: మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతు పనులు చేయనుండడంతో అంతరాయం ఉంటుందని తెలిపారు.

రైతులకు తారపాళ్ల పంపిణీ

గుంతకల్లు టౌన్, జూలై 12: మండలంలోని కసాపురం గ్రామంలో గుండాల, కసాపురం గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ రైతులకు శుక్రవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి డ్రమ్ములు, తారపాళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆర్గానిక్ ఫార్మింగ్‌ను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా కొన్ని గ్రామాలను ఎంపిక చేసిందన్నారు. ఆర్గానిక్ ఎరువులు తయారు చేయడానికి ఉచితంగా డ్రమ్ములతో పాటు, తారపాళ్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు గుమ్మనూర్ వెంకటేష్, పాలమల్లికార్జున, రాయలరామయ్య, ఆ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢమాస పూజలు

యాడికి, జూలై12: ఆషాఢ మాస శుక్రవారాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని గోరింటాకుతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాభవాని ఆలయంలో ..

ఉరవకొండ: పట్టణంలోని రాంనగర్‌లో గల దుర్గాభవాని ఆలయంలో ఆషాఢమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకరణలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



యాడికిలో గోరింటాకు అలంకరణలో కన్యకాపరమేశ్వరి



ఉరవకొండలో ప్రత్యేక అలంకరణలో దుర్గాభవాని

డీఈఈ కార్యాలయం ప్రారంభం

గుంతకల్లు, జూలై12: పట్టణంలోని ట్రాన్స్‌కో సబ్ డివిజనల్ కార్యాలయ నూతన భవనాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. స్థానిక అలూరు రోడ్డులో ట్రాన్స్‌కో సబ్ డివిజనల్ కార్యాలయ భవనాన్ని రూ. 2.4 కోట్లతో నిర్మించారు. పనులు పూర్తికావడంతో ఎంపీ ముఖ్యఅతిథిగా వచ్చి లాంఛనంగా ప్రారంభించారు. పట్టణంలోని ఉన్న ఏపీఎస్‌పీడీసీఎల్ అకౌంట్సు కార్యాలయం, డీ-1, డీ-2, రూరల్ కార్యాలయాలను కూడా ఈ సబ్ డివిజనల్ కార్యాలయ భవనంలోకి బదిలీచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, టీడీపీ నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు వెంకటేశులు, ప్రతాప్ నాయుడు, తలారి మస్తానప్ప, శివన్న, వీరేశ్, ముష్టూరు తిమ్మప్ప, బండి లక్ష్మీదేవి, అంజలీదేవి, విద్యుత్ ఎస్ఈ సురేంద్ర, డీఈఈ రాజశేఖర్, ఏడీఈ రంగస్వామి, ఏఈలు పాల్గొన్నారు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఫుట్ వే బ్రిడ్జి నిర్మించాలని ఎంపీకి వినతి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో ఫూట్ వే బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు టీడీపీ మాజీ కౌన్సిలర్ అంజి, ఆ కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. విద్యుత్ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరైన ఎంపీని వారు కలిసి మాట్లాడారు. ఇంద్రానగర్ కాలనీలో రైల్వే ట్రాక్ ఉండటంతో రైళ్ల రాకపోకలు విపరీతంగా పెరిగాయన్నారు. ట్రాక్ దాటి వెళ్లకుండా రైల్వే అధికారులు ఎత్తైన గోడలు నిర్మించారన్నారు. పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు, పాదాచారుల సౌకర్యార్థం ఫుట్ వే బ్రిడ్జి నిర్మించాలని ఎంపీని కోరారు. అనంతరం ఎంపీ కాలనీలో పర్యటించి కాలనీ వాసులతో మాట్లాడారు.

భార్య మందలించిందని ఆత్మహత్య

రాయదుర్గం, జూలై 12: భార్య మందలించిందని క్షణికావేశానికి లోనైన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీ ఏరియాలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రాయదుర్గం మండలం 74 ఉడేగోళం గ్రామానికి చెందిన రమేష్ (35) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. మూడేళ్ల క్రితం పట్టణానికే చెందిన సుజాతను వివాహం చేసుకున్నాడు. కాగా అప్పటికే సుజాతకు వివాహం జరిగి సంతానం ఉంది. మొదటి భర్తను వదిలేసి రమేష్‌ను రెండో వివాహం చేసుకుంది. వారు మూడేళ్లుగా రాజీవ్‌గాంధీకాలనీలో అద్దెఇంటిలో నివాసం ఉంటున్నారు. కాగా ఇటీవల మనస్పర్థలు వచ్చి తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంటికి చేరుకున్న రమేష్‌కు భార్యతో గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన భార్య తీవ్రస్థాయిలో మందలించి ఇంటి నుంచి బయటికి వచ్చింది. మనోవేదనకు గురైన రమేష్ క్షణికావేశంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటికి భార్య ఇంట్లోకెళ్లి చూడగా ఆయన ఉరికి వేళాడుతూ కనిపించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి రమేష్‌ను కిందకు దింపి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. పోలీసులకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రమేష్ (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్, జూలై 12: మండలంలోని పాపంపల్లికి చెందిన మంజునాథ్ చౌదరి (30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి తల్లి గౌరమ్మ కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... మంజునాథ్ చౌదరి గత కొన్నేళ్లుగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరి గానే గురువారం రాత్రి పది గంటల సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. భోజనం చేసి ఆ తర్వాత ఇంటి ఆరుబయట నిద్రించాడు. తల్లి, సోదరి అనిత ఇంట్లోనే నిద్రించారు. కాగా శుక్రవారం ఉదయం అతను ఎంతసేపటికీ నిద్రలేవలేదు. అనుమానం వచ్చి తల్లి తట్టి లేపేందుకు యత్నించింది. అయితే ఎంతకీ లేవకపోవడంతో బంధువుల సాయంతో వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి ఆటోలో తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంటనే తల్లి తన కుమారుడి మృతి పట్ల అనుమానం ఉన్నట్లు కళ్యాణదుర్గం సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసింది. కుమారుడికి ఎవరైనా ప్రమాదం తలపెట్టారేమోనని ఆమె అనుమానం వ్యక్తం చేస్తోంది. నెల రోజుల క్రితం పక్క గ్రామంలో మంజునాథ చౌదరి చిన్నపాటి ఘర్షణకు దిగాడని తెలుస్తోంది. పోలీసులు, వైద్యులు మాత్రం అతను వాంతులు చేసుకోవడంతో గుండెనొప్పితో మరణించి ఉండవచ్చునని చెబుతున్నారు. తన కుమారుడు ఎటువంటి అనారోగ్యానికి గురికాలేదని, మృతిపై అనుమానాలు ఉన్నాయని, దర్యాప్తు చేపట్టాలని తల్లి ఫిర్యాదులో కోరింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు అవివాహితుడు.



మంజునాథ్ చౌదరి (ఫైల్)

చిన్నారిని హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

రాయదుర్గం రూరల్, జూలై 12: నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని ఓ గ్రామంలో వాల్మీకి వర్గానికి చెందిన 9ఏళ్ల చిన్నారిని సామూహిక అత్యాచారం, హత్య చేసి నీటి కాలువలో పడేసిన దుండగులపై కఠినచర్యలు తీసుకోవాలని వాల్మీకి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద గల వాల్మీకి మహర్షి విగ్రహానికి శుక్రవారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బాలికను అతి దారుణంగా హత్య చేసి ఐదురోజులైందన్నారు. ఇంతవరకు పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ సంఘటనపై రాష్ట్రంలో వాల్మీకి సోదరులు ఏకమై ఆందోళనలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

కళ్యాణదుర్గం, జూలై 12 : మండలంలోని భట్టువానిపల్లిలో ముగ్గురు రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్‌ను ఎత్తుకెళ్లారు. ఉదయం పొలాల వద్దకు వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై కనిపించాయని బాధిత రైతులు నరసింహులు, మహేంద్ర, వెంకటేశుకు వాపోయారు. దీంతో రూ. 80 వేల వరకు నష్టం సంభవించినట్లు చెప్పారు. పోలీసులు స్పందించి వీటికి అడ్డుకట్ట వేయాలని కోరారు.



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

అతిసారపై అవగాహన ర్యాలీ

బొమ్మనహాళ్, జూలై 12: మండలంలోని బండూరు గ్రామంలో శుక్రవారం బొమ్మనహాళ్ ప్రాథమిక వైద్యశాల సిబ్బంది స్థానిక పాఠశాల విద్యార్థులతో కలిసి అతిసారపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా మారుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని సేవించాలని, వేడి చల్లారక ముందే భోజనం చేయాలని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే పరిశీలన

గుత్తి,జూలై12: పట్టణంలో పలు వార్డులలో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది డ్రై డేను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డయేరియా వంటి వ్యాధులు ప్రబలకూండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

కేజీబీవీ తనిఖీ

బెళుగుప్ప, జూలై 12 : మండలకేంద్రంలోని కేజీబీవీని ఎంపీడీవో సుబ్బరాజు, శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని, అక్కడి వసతులను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

ఉపాధ్యాయుల బాహాబాహీపై డీఈఓ విచారణ

యాడికి, జూలై12: మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాలలో ఉపాధ్యాయుల బాహాబాహీకి దిగిన సంఘటనపై శుక్రవారం డీఈఓ వరలక్ష్మి విచారణ చేపట్టారు. ఎంఈఓలు కాశప్ప, ధనలక్ష్మి ఉదయమే పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి గొడవపై ఆరాతీశారు. విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు గొడవపడడం తగదని తెలిపారు. మధ్యాహ్నం డీఈఓ వరలక్ష్మి ఆదర్శ పాఠశాలకు విచారణ నిమిత్తం వచ్చారు. ఉపాధ్యాయుల గొడవపై ఆరాతీశారు. గొడవపడ్డ ఉపాధ్యాయుల వివరణ తీసుకున్నారు. సంఘటనపై నివేదికను ఇవ్వాలని ఎంఈఓలకు తెలిపారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుల గొడవపై నివేదికను ఆదర్శ పాఠశాలల ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. వారి ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.